


కథ

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

# తృప్తి

మంత్రి మీనారావు నాలుగు రోజుల నుంచీ చాలా అసహనంగా ఉంటున్నాడు. ప్రతి చిన్న విషయానికి చిర్రుబుర్రులాడుతున్నాడు విషయం అర్థం కాక. అటు ఉద్యోగులు, ఇటు ఇంట్లో భార్యాపిల్లలు తలలు పట్టుక్కూచున్నారు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్లుతూ ఉండే మీనారావు అలా ఎందుకు మారిపోయాడో అతని భార్యకు అర్థం కాలేదు. ఎందుకంటే తన ఇరవై అయిదు సంవత్సరాల వైవాహిక జీవితంలో అతనిని ఎప్పుడూ అలా చూడలేదు.

ఆ రోజు అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలని మీనారావు భార్య సంధ్య నిశ్చయించుకుంది.

బెడ్‌రూమ్‌లో మీనారావు మీద అనునయంగా చెయ్యి వేసి-

“ఏమండీ! ఏమిటండీ ఈమధ్య అదోలా ఉంటున్నారు?” అంటూ విషయం రాబట్టడానికి ప్రయత్నించింది.

“అంతా నా ఖర్మ!” అంటూ ఉరుమూ లేని పిడుగులా తల బాదుకోవడం మొదలుపెట్టాడు మీనారావు.

“ఏమిటండీ.. అలా బాదుకుంటున్నారు?” ఆతృతగా అడిగింది సంధ్య.

“అసలు.. అసలు.. చెప్పులు తీసుకురా” అన్నాడు ఆవేశంగా మీనారావు.

“చెప్పులెందుకండీ?.. ఈ అర్థరాత్రి వేళ ఎక్కడికి వెడతారు? అయినా మీరు బెడ్‌రూములో చెప్పులు ఎప్పుడూ వేసుకోరుగా?. అసలు హాలు దాటి చెప్పులు తీసుకురావద్దంటారుగా” అమాయకంగా అడిగింది సంధ్య.

“నిన్ను... నిన్ను.. చెప్పులు కావాలన్నది అవి తొడుక్కుని ఈ అర్థరాత్రి ఊరేగడానికి కాదు. నా రెండు చెంపలు శక్తిదీరా వాయించుకోవడానికి” అన్నాడు మీనారావు ఊగిపోతూ.

సంధ్యకి మతిపోయినట్లయింది.

“ఏమయిందండీ? ఏమిటి అలా మాట్లాడుతున్నారు... అసలేం జరిగింది? ఎవరన్నా ఏమన్నా అన్నారా? ముఖ్యమంత్రిగారు కానీ, ప్రతిపక్ష సభ్యులు కానీ మిమ్మల్ని విమర్శించారా? లేకపోతే మీరు చేసిన ఏ కాని పని అన్నా...” ఇంకా ఏదో అనబోయింది సంధ్య.

మీనారావు ఆమె నోటిని తన చేతితో బలవంతంగా మూసేశాడు.

“నేను బాధపడుతున్నది నిన్ను కట్టుకున్నందుకు. నీ తమ్ముడు లాంటి అద్భుతమైన బావమరిదిని కలిగి ఉన్నందుకు... మీ కుటుంబానికి, నా ఖర్మ కాలి అల్లుడిని అయినందుకు” ఒక్కసారిగా మీనారావు కోపం అత్తింటి వైపుకి తిరిగింది.

“మధ్యలో మేమేం చేశాం? అయినా నేనన్నా మా కుటుంబమన్నా మీకెప్పుడూ అలుసే” ఒక్కఉదుటున రుద్రకాళి అవతారం దాల్చింది సంధ్య.

మీనారావుకి ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోవాల్సిన అవసరం ఏర్పడింది.

“అదికాదు సంధ్యా.. ఆ బడుద్ధాయి.. అదే నీ తమ్ముడు నాకు తోచనివ్వడం లేదు, తొంగనివ్వడం లేదు” తన గోడు చెప్పుకోబోయాడు.

“అవునులెండి. మా వాళ్లంతా బడుద్ధాయిలు, తెలివితక్కువవాళ్లు. అయినా నాలాంటి తెలివితక్కువ దద్దమ్మని ఏరికోరి చేసుకున్న మీరెంత తెలివిమంతులో?” వ్యంగ్యాస్త్రం వదిలింది సంధ్య.

“నా తెలివి తెల్లారినట్లే ఉంది కానీ... అసలు విషయం వినకుండా నువ్వు ఆవేశపడి డైలాగులు వదలొద్దు. విషయం వినవేమిటి” అన్నాడు మీనారావు అసహనంగా.

“ఆ! ఇంకా ఏమిటి వినేది. మీకేదైనా కోపమొస్తే తిట్లదండకాలు, శతకాలు మొదలెడతారు అంతేగా” అంది సంధ్య మూతి విరుస్తూ. ఎన్నో శృంగార సంగ్రామాలు చూసిన మీనారావు బెడ్‌రూమ్ రణరంగంగా మారడానికి సిద్ధం అవుతోందని గ్రహించాడు అతను.

“దండకాలు, శతకాలు రాయడానికి నేనేమీ కవిని కాదు గానీ, కాస్త నే చెప్పేది విను, అసలు విషయం తెలుసుకో” బ్రతిమాలే ధోరణిలోకి దిగాడు మీనారావు.

“సరే చెప్పండి.. అయినా మీకు అసలు విషయం చెప్పకుండా ప్రజలకు ఏవేవో చెప్పడం అలవాటుగా” దెప్పింది సంధ్య.

“అబ్బా!!.. కాస్త నేను చెప్పేది విను” అంటూ భార్య గెడ్డం పట్టుకున్నాడు మీనారావు.

“ఊ.. కానీయండి మీ స్పీచ్” సంధ్య వాక్ప్రవాహంలో వ్యంగ్యం పోలేదు.

“మీ తమ్ముడు అదే మీ అమ్మ, నాన్నల గారాల పట్టి.. వారం రోజుల క్రితం ముఖ్యమంత్రితో ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడుతూంటే అదే పనిగా సెల్‌కి ఫోన్ చేశాడు. నేను ఎన్నిసార్లు కట్ చేసినా వదలడే. ఆఖరికి స్విచాఫ్ చేశాను. తరువాత రోజు పార్టీ అత్యవసర సమావేశంలో ఉండగా ఒకటే విసిగింపు”

“వాడేం అర్జెంటు విషయం మాట్లాడలనుకున్నాడేమో. ఓసారి ఫోన్ చెయ్యవచ్చుగా”

“అమ్మా! తల్లీ! అదీ జరిగింది. ఆ తరువాత నేను ఫోన్ చేశాను. నా వల్ల ఏదో సహాయం కావాలంటాడు గానీ, విషయం చెప్పడు. ట్రాన్స్‌ఫరా, ప్రమోషనా అంటే మాట్లాడడు. విషయం నన్ను స్వయంగా కలుసుకున్నప్పుడే చెపుతానంటాడు. వెంటనే బయలుదేరి రమ్మన్నాను. ఇంకొంత కాలం ఆగాలంటాడు. ఏమిటో చెప్పడు... ఎందుకో చెప్పడు....పోనీ అలాగని ఊరుకుంటాడా... నేను ఎప్పుడు ఎక్కడ ఖాళీగా ఉంటాను అని ఒకటే ఆరాలు. ఇంటికి ఏడవవచ్చు కదా అంటే విషయం అక్కకు కూడా తెలియకూడదంటాడు. నాకు చావొచ్చి పడిందనుకో” అన్నాడు మీనారావు దిగా

లుగా మొహంపెట్టి.

"ఏమిటీ? నాకు కూడా తెలియకూడదన్నాడా? అంత రహస్యంగా ఉంచాల్సింది ఏమిటి అయి ఉంటుందబ్బా?" అంటూ క్వశ్చన్ మార్క్‌లా మొహం పెట్టింది సంధ్య.

"అదే నాకూ అర్థం కానిది. అస్తమాను ఫోను చెయ్యడం. విషయం ఇప్పుడు కాదులే అనటం... ఇంకా టైముందిలే అనడం... తరువాత అడుగుతానులే అనడం... కొంపముంచి ఎవడినన్నా వేసేసి కేసు లేకుండా చేయమని అడుగుతాడా ఏమిటి? ఈమధ్య తన పై ఆఫీసరు తెగ సతాయిస్తున్నాడని ఒకటే గోల. అయినా ఆ బడుద్ధాయికి ఆవేశంగా మాట్లాడడమే చేతకాదు ఇంక హత్యలు ఏం చేస్తాడు.. ఛ! బుర్రపాడయిపోతోంది"

"ఏమండీ..." అంటూ ఆగిపోయింది సంధ్య.

తన తమ్ముడు ఎవరినో హత్య చేసినట్లు అతనిని జైలులో పెట్టినట్లు, బెయిల్ కూడా లభించనట్లు అంతా సినిమా రీలులా కదిలింది సంధ్య మనసులో.

"నో!!??" కెవ్వుమని అరిచింది సంధ్య.


మీనారావు అసలే టెన్షన్‌లో ఉన్నాడేమో "ఏమయింది సంధ్యా?" అంటూ అప్రయత్నంగా గుండె మీద చెయ్యి వేసుకున్నాడు.

"ఏమీ లేదులెండి. ఏదో పిచ్చి ఆలోచన. అసలు విషయం ఏమిటో ఇప్పుడే కనుక్కుంటాను ఉండండి" అంటూ భర్త జేబులో సెల్ ఫోన్ విసురుగా లాక్కుంది సంధ్య.

సంధ్య తమ్ముడికి ఫోన్ చెయ్యడం, అతను ఏమీ చెప్పకపోవడం, గట్టిగా అడిగేసరికి, అది చాలా ముఖ్య విషయమని బావతోనే చెపుతానని కరాఖండిగా చెప్పి, ఫోను పెట్టేయడం జరిగింది.

జీవితంలో మొదటిసారిగా తమ్ముడి మీద కోపం వచ్చింది సంధ్యకు.

తన భర్త పరిస్థితి చూస్తే జాలి వేస్తోంది. అందరినీ హడలగొట్టగల మీనారావు తన తమ్ముడిని ఏమీ అనలేదు. రాణిగారి తమ్ముడు రాజుగారి కంటే పవర్‌ఫుల్ అన్నది ఎప్పటి నుంచో ఉన్న నానుడే!!



"వాడేం చెప్పడం లేదండీ" నసిగింది సంధ్య.

"కనీసం అస్తమానూ ఫోన్ అన్నా చెయ్యొద్దని గట్టిగా చెప్పావా?"

"చెప్పాను.. కానీ వాడు వింటేగా.. వాడు టెన్షన్ ఫీలయినప్పుడు మీకు ఫోన్ చేస్తున్నాడుట. కానీ నోటి దాకా వచ్చేసరికి చెప్పలేక పోతున్నాడట"

"ఎందుకు ఆ టెన్షన్ నాకు ట్రాన్స్‌ఫర్ చేసి హార్ట్ అటాక్ తెప్పించడానికా? అబ్బబ్బ!! ఎన్నెన్నో అసెంబ్లీ సెషన్లు తట్టుకున్నాను. ఎంతోమంది ప్రతిపక్ష నాయకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నాను. రాజకీయాల్లో భీష్ముడులాంటి నాకు శిఖండిలా మీ తమ్ముడు ఎదురయ్యాడు... మతిపోగొట్టేస్తున్నాడు"

నా తమ్ముడిని అంత మాటంటావా అంటూ ఇంతెత్తు లేస్తూ, గయ్యిమంది సంధ్య.

"అబ్బా! ఏదో మాటవరుసకు అన్నాలే సంధ్యా. అసలే టెన్షన్‌తో నేను చస్తూంటే నువ్వు మరింత టెన్షన్ పెడతావేమిటి?"

మీనారావు మాట ముగించే లోపలే ఫోన్ రింగయింది. ఆ ఫోన్ బామ్మర్ది దగ్గర నుంచే. షరామామూలే. అతనికి చిర్రెత్తుకొచ్చింది. పచ్చి బూతులు తిట్టబోయాడు. ప్రక్కనే భార్య ఉందని సంభాళించుకున్నాడు. కానీ ఆ టైములో అతను బి.పి.చూపించుకుంటే బి.పి. మీటరులోని మెర్క్యురీ బైటకు వెళ్లిపోయేది!!

ఇంతోటి దానికి అర్థరాత్రి ఫోన్ చేసి చెప్పాలా అని బయటకి విసుక్కున్నాడు. ఆ రాత్రంతా ఆలోచనలతో మీనారావుకి నిద్రపట్టలేదు.

మరుసటి రోజు సచివాలయానికి వెళ్లాడు మీనారావు.

ఆఫీసులో సెక్రటరీతో ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడుతూ ఉండగా బామ్మర్ది నుంచి ఫోను.

అప్పుడు వర్జ్యం, దుర్ముహూర్తం లాంటివి ఉన్నాయని, సాయంత్రం అయిదు గంటలకల్లా మరలా ఫోన్ చేసి విషయం చెపుతానన్నది ఫోన్ సారాంశం.

"ఒరేయ్ నిన్ను చంపి నేను జైలుకి వెడతాను" అని గట్టిగా ఫోన్‌లోనే అరిచాడు మీనారావు. అవతల ఫోన్ పెట్టేశాడు అతని బామ్మర్ది. సెక్రటరీకి ఏమీ అర్థంకాక అయోమయంగాగానూ, అదోలాగా చూశాడు మీనారావు వైపు. ఆ చూపుకి మీనారావుకి తలకొట్టేసినట్లయింది. అయినా మొహానికి నవ్వు పులుముకుని తన చర్చ కొనసాగించాడు. ఆ రాత్రికి ఇంట్లో అడుగు పెడుతూనే తన భార్యపై ఒంటికాలిపై త్రాచుపాములా లేచాడు. ఉగ్రనరసింహమూర్తే అయిపోయాడు మీనారావు.



"నేను చెయ్యలేని, చెయ్యకూడని పని అని తెలిసి కూడా నన్ను అడుగుతాడా మీ తమ్ముడు. పైగా దానికి వెధవ సస్పెన్సు రాద్ధాంతమా?" భర్తని ఆ రూపంలో చూసిన సంధ్య బెదిరిపోయింది.

"ఏమయిందండీ? ఏమిటి అడిగాడు?" భయంభయంగా అడిగింది సంధ్య.

"ఏముంది మీ తమ్ముడికి హఠాత్తుగా పెద్ద రచయితను అయిపోవాలనే దురాశ కలిగింది.. ఏదో కథ రాసి తగలేశాడుట. దానిని పోటీకి పంపుతన్నాడట. ఆ పత్రికా యజమానితో మాట్లాడి మీవాడి ఇంతోటి రచనకు ప్రైజు ఇప్పించాలిట!

"పోనీ మీరు వాళ్లతో మాట్లాడవచ్చు కదా.." నెమ్మదిగా అంది సంధ్య.

"చాల్లే నోర్ముయ్... ఇంకా నీకు, మీవాడికి బుద్ధి వస్తుందనుకోవడం నా బుద్ధి తక్కువ.. రాజకీయ నాయకులకు కూడా కొన్ని నియమాలు ఉంటాయి.... నేను ఎన్ని పనులు చేసినా వాటికి ఒక అర్థం, ప్రయోజనం ఉన్నాయి. అసలు అలాంటి పని చేస్తానని ఎలా అనుకున్నాడే వాడు.. నేను చచ్చినా చెయ్యను. సరస్వతి పుత్రులకు అన్యాయం చేస్తే కళ్లుపోతాయి.. ఎవరి రచన బాగుంటే వాళ్లకి బహుమతి రావాలి గానీ.. నేను రికమెండు చెయ్యకపోతే చస్తానని బెదిరించాడు మీ తమ్ముడు. ఆత్మహత్య చేసుకుంటానన్నాడు.. ఛావనీ భూభారం తగ్గుతుంది... ఈసారి ఎప్పుడూ అలాంటి పిచ్చి ఫోనులు చెయ్యొద్దని చెప్పు" అన్నాడు మీనారావు నిప్పులు కక్కుతూ.

సంధ్య కోపం రుసరుసా బెడ్ రూమ్‌లోకి పరుగుతీసింది. అంత కోపంలోనూ భార్యను, బామ్మర్దినీ అసంతృప్తిపరిచినా, కోట్లాది పాఠక లోకానికి అన్యాయం చెయ్యలేదనే తృప్తి కలిగింది మీనారావుకి.

## అమృత తంటాలు

'అతిథి' సినిమాలో నటించినప్పుడు తెగ పోజులు కొట్టేసిన అమృతారావుకి ఆ సినిమా ఫట్‌మని పేలిపోవడంతో మారుమాట లేకుండా పోయింది. ఇక బాలీవుడ్‌లో సైతం తన కెరీర్ బొత్తిగా బాగోకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఇక లాభం లేదనుకుందేమో- హాట్ హాట్ గెటప్పులతో ఫొటోలు తీయించుకుని నలుగురి దృష్టిలోకీ వచ్చేలా చూస్తోందిప్పుడు. దీంతో కొత్తగా అమృత పైకి దృష్టిని మళ్లిస్తున్న నిర్మాతలు క్రమంగా పెరుగుతున్నారట. మరి అమృత అందాల ఆరబోత పుణ్యమా అని ఆమెకి ఎన్ని ఆఫర్లు వచ్చిపడతాయో చూడాలి!